నిబంధన.. ఉల్లంఘన

- వైసీపీ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, రేషన్ డీలరు
- చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నేతల డిమాండ్

పలాస/ కంచిలి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల వేళ.. కొంతమంది నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, రేషన్ డీలర్లు ఎన్నికల కోడ్‌ను విస్మరిస్తూ.. వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నారు. పలాసలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వైసీపీ సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన ఫొటోలను వైసీపీ నాయకులే మీడియాకు విడుదల చేయడం వారి బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. పలాసలోని 20వ వార్డులో మంగళవారం 6.30 నుంచి 8 గంటల వరకు వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శివాజీనగర్ మదర్‌థెరిస్సా విద్యాలయం వెనుకవీధిలోని పెద్దలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వార్డు పెద్ద బొంగు ప్రసాద్ ఇంటి వద్ద కూర్చొని సమస్యలపై అవగాహన కోసం మాట్లాడారు. అనంతరం వైసీపీ ఫ్లకార్డులు పట్టుకొని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తామని వారితో చెప్పించారు. వార్డు పెద్దలు తమకు మద్దతు తెలిపినట్టు సంబంధిత చిత్రాలను వైసీపీ నాయకులు విడుదల చేశారు. కాగా.. ఈ సమావేశంలో పలాస మండలం పెదంచల పాఠశాల ఉపాధ్యాయుడు మాధవబెహరా కూడా పాల్గొన్నట్టు స్థానికులు గుర్తించారు. కోడ్ ఉల్లంఘిస్తూ వైసీపీ సమావేశంలో పాల్గొన్న ఆ ఉపాధ్యాయుడి చిత్రాలను ఎన్నికల అధికారులకు పంపించారు.

- ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైసీపీ ప్రచారంలో పాల్గొన్న రేషన్ డీలర్ పండాపై చర్యలు తీసుకోవాలని కంచిలి మండల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు బొడ్డ హరిబాబు, మాదిన రామారావు, టీపీ రమణ, మద్దిల భాస్కరరావు, కె.కురయ్య తదితరులు విలేకరులతో మాట్లాడారు. సోమవారం జలంత్రకోటలో వైసీపీ అభ్యర్థి నిర్వహించిన ప్రచారంలో రేషన్‌డీలర్ పాల్గొన్నారని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌తోపాటు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎం.ఎం. పట్నాయక్, మన్మథరావు పాల్గొన్నారు.


పలాస : వైసీపీ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు మాధవ బెహరా (వృత్తంలో)


తనిఖీ చేస్తున్న ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్

నగదుతో పట్టుబడిన బైక్‌లు సీజ్

ఆమదాలవలస, మార్చి 26: ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని తిమ్మాపురం జంక్షన్ వద్ద మంగళవారం ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. నగదుతో పాటు పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. శ్రీకాకుళం బొందిలీపురానికి చెందిన టీక మోడి నాగేంద్ర ప్రసాద్, ఇలిసిపురానికి చెందిన గుత్తుల శ్రీను.. శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు రెండు ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా ఒక వాహనంలో రూ.82,820, మరో వాహనంలో రూ.54,630 ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసి నగదు, ద్విచక్రవాహనాలు సీజ్ చేశామని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



కలెక్టరేట్, మార్చి 26: జిల్లాలో వివిధ పార్టీల ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని రిటర్నింగ్, ఎంసీసీ, నోడల్, కంట్రోల్ రూమ్ అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు, లౌడ్ స్పీకర్లకు అనుమతులు ఉండాల్సిందేనన్నారు. తాత్కాలికంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినా, ప్రచార వాహనాలకు, సభావేదిక, బారికేడ్ల ఏర్పాటుకు, ఇంటింటి ప్రచారం, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ప్రచారాలు నిర్వహిస్తే ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రచార పత్రాల పంపిణీ, పార్టీ జెండాలు పెట్టేందుకు, పోస్టర్లు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతుల కోసం 48 గంటల ముందు సువిధ యాప్‌లోకానీ, ఆఫ్‌లైన్‌లో సంబంధిత రిటర్నింగ్ అధికారికి కానీ దరఖాస్తు చేసి 24గంటల్లో పొందవచ్చన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ విషయాలను గమనించాలని సూచించారు.

ఆరుగురు బీఎల్వోలకు షోకాజ్


మాట్లాడుతున్న సుదర్శనదొర

ఇచ్ఛాపురం, మార్చి 26: ఆరుగురు బీఎల్వోలకు రిటర్నింగ్ అధికారి సుదర్శనదొర షోకాజ్ నోటీసులు జారీచేశారు. మంగళవారం ఇచ్ఛాపురంలో ఇచ్ఛాపురం, కవిటి మండలాల బీఎల్వోలకు ఎన్నికల నియమావళికి సంబంధించి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురానికి చెందిన 80 మంది, కవిటి మండలానికి చెందిన 73 మంది బీఎల్వోల్లో ఆరుగురు గైర్హాజరుకావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు లేకుండా, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఎటువంటి రాజకీయ పోస్టర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మృతులు, వలస వెళ్లినవారు ఉంటే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీహరి, 147మంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.


పగిలిన పోలీసుస్టేషన్ అద్దాలు

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి వీరంగం

- అద్దాలు పగలుగొట్టి బీభత్సం
- పరుగులు పెట్టిన పోలీసులు

పలాస, మార్చి 26: సాధారణంగా పోలీసులంటే అన్ని వర్గాల ప్రజలు హడలిపోతుంటారు. మందుబాబులు, పేకాటరాయళ్లు, రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్ అంటే వణుకు. కానీ మంగళవారం ఓ వ్యక్తి తప్పతాగి కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ఉన్మాదిగా వ్యవహరించడంతో పోలీసులు సైతం భయపడి బయటకు పరుగులు తీశారు. ఇంతకీ అతడు ఏం చేశాడంటే.. రక్తమోడిన చేతితో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు మంగళవారం మధ్యాహ్నం వచ్చాడు. తనపై బార్‌లో దాడి చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని తొలుత కోరాడు. అనంతరం తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ గోడలకు అమర్చిన కూలింగ్ గ్లాస్ అద్దాన్ని బలంగా చేతితో పగలకొట్టాడు. తీవ్ర రక్తస్రావం కాగా.. పోలీసుస్టేషన్ అంతా కలియతిరిగి.. అడ్డం వచ్చిన కానిస్టేబుల్‌పై సైతం పిడిగుద్దులు కురిపించాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు, పదో తరగతి పరీక్ష పత్రాలకు వచ్చిన ఉపాధ్యాయులపైనా దాష్టీకాన్ని ప్రదర్శించాడు. చేతికి దొరికిన వస్తువులతో అందర్నీ హడలెత్తించాడు. దీంతో స్టేషన్‌లో ఉన్న వారంతా బయటకు పరుగులు పెట్టారు. చివరకు ముగ్గురు కానిస్టేబుల్స్ ధైర్యం చేసి ఆయన్ను బలవంతంగా పట్టుకుని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరంగం సృష్టించిన వ్యక్తి.. కాశీబుగ్గ డెంకివీధికి చెందిన జంగం మణికంఠ అనే యువకుడిగా పోలీసులు గుర్తించి ఆయనపై విచారణ చేపట్టారు. ఈయన కేటీ రోడ్డులోఉన్న బారులో మద్యం తాగి అక్కడ వీరంగం సృష్టించాడు. అక్కడ దెబ్బలు తగలడంతో తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఉన్మాదిగా వ్యవహరించాడని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మణికంఠ తండ్రి కూడా ఆసుపత్రికి చేరుకుని పోలీసులే తన కుమారుడ్ని కొట్టారని ఆరోపిస్తూ వారిపై కేకలు వేశారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ వెంకటరావు, సిబ్బంది చేరుకొని పరిస్థితి చక్కదిద్దారు.


చికిత్స పొందుతున్న మణికంఠ

స్టాక్ ఉన్నా.. నో సేల్!

- గత ఏడాది కంటే 10 శాతం తగ్గించి విక్రయించండి
- మనిషికి ఒకటే సీసా ఇవ్వండి
- సిబ్బందికి ఉన్నతాధికారుల ఆదేశాలు
- ముందుగానే మూతపడుతున్న మద్యం దుకాణాలు
- షాపుల వద్ద సిబ్బందితో మందుబాబుల వాదనలు




రణస్థలం మద్యం షాపు వద్ద బారులుదీరిన మందుబాబులు

(రణస్థలం)

జిల్లాలోని మద్యం దుకాణాల్లో స్టాక్ ఉన్నా.. నిర్దీత సమయం వరకూ విక్రయాలు చేపట్టడం లేదు. ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకూ మద్యం విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొన్ని మద్యం దుకాణాలు సాయంత్రం 7గంటలకే మూతపడుతున్నాయి. ఒకవేళ షాపులు తెరిచి ఉన్నా మద్యం అమ్మడం లేదు. గత ఏడాది ఈ తేదీల నాటికి విక్రయించిన మద్యం కంటే 10శాతం అమ్మకాలు తగ్గించాలని ఉన్నతాధికారుల నుంచి సిబ్బందికి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నిర్దీత మద్యం సీసాలు మాత్రమే విక్రయించి.. ముగిస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా.. ఒక మనిషికి ఒక సీసా మాత్రమే విక్రయిస్తున్నారు. ఈక్రమంలో షాపుల వద్ద మందుబాబులు బారులుదీరుతూ.. సిబ్బందితో వాదనలకు దిగుతున్నారు. అడిగినంత మద్యం విక్రయించకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. నిర్దీత సమయానికి ముందే దుకాణాలు మూసేయడమేంటని నిలదీస్తున్నారు. దీంతో ఏమిచెప్పాలో తెలియక సిబ్బంది సతమతమవుతున్నారు. గత మూడు రోజులుగా జిల్లా అంతటా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గత ఏడాది కంటే 10శాతం మద్యం అమ్మకాలు తగ్గించాలన్న ఆదేశాలకు సహేతుకమైన కారణాలను అధికారులు వెల్లడించడం లేదు. ఎన్నికల ముంగిట ఈ నిర్ణయం తీసుకోవడంతో మద్యం షాపుల నుంచి పెద్దఎత్తున మద్యాన్ని బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకే అమ్మకాలు తగ్గించి ఉండవచ్చన్న అనుమానాలున్నాయి. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది వైసీపీ హయాంలో నియమితులైన వారే. దీంతో వారే మద్యం స్టాకు చేసి పక్కదారి పట్టిస్తున్నారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉంది.

ఆది నుంచీ చిత్రవిచిత్రాలే

మద్యం విషయంలో వైసీపీ పాలనలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామని ప్రతిపక్ష నేతగా జగన్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ ఉత్తిదేనని తేలిపోయింది. గతంలో ప్రైవేటు మద్యం షాపులు ఉండగా.. వైసీపీ ప్రభుత్వం 2019 అక్టోబరులో కొత్త మద్యం పాలసీని ప్రకటించింది. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపేందుకు నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 154 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. ఏడాది తరువాత ఇందులో 25 శాతం మద్యం దుకాణాలు తగ్గించనున్నట్టు చెప్పింది. అందుకు తగ్గట్టుగానే 2020 అక్టోబరులో 23 మద్యం దుకాణాలను తగ్గించింది. దీంతో ఏటా వీటి సంఖ్య తగ్గుతాయని అంతా భావించారు. కానీ అప్పటి నుంచి తగ్గించకపోగా.. రకరకాల పేర్లతో మద్యం దుకాణాలను పెంచుతూనే ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలు 144, పర్యాటక ప్రాంతాల్లో మరో 25 షాపులు, వాకిన్ మాల్స్ పేరిట మరో ఐదు దుకాణాలను నడుపుతున్నారు. ఇక బార్ల సంఖ్య 18. ఇలా 30 మండలాల్లో 192 దుకాణాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి.

పొరుగు మద్యానికి కట్టడేదీ?

సరిహద్దున ఉన్న ఒడిశా మద్యం.. జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒక చోట పట్టుబడుతూనే ఉంది. ఆంధ్రాలో నాసిరకమైన బ్రాండ్లు విక్రయించడంతో ప్రజారోగ్యానికి విఘాతం కల్గిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నేతల బినామీ కంపెనీలకు చెందిన మద్యాన్ని విక్రయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా.. ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒడిశాలో మాత్రం మన రాష్ట్రంలో కన్నా తక్కువ ధరలకే నాణ్యమైన బ్రాండ్లు లభిస్తుండడంతో.. చాలా మంది అక్కడి నుంచి మద్యాన్ని తెచ్చుకుంటున్నారు. కొంతమంది ఒడిశా మద్యాన్ని తెచ్చి విక్రయిస్తూ.. ఇక్కడ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యమే కాదు.. ఒడిశా సారా కూడా జిల్లాలో చలామణీ అవుతోంది. పట్టణాల్లో సైతం సారా ప్యాకెట్లు వెలుగుచూడడం విస్తుగొల్పుతోంది. సారాను నీటి మార్గంలో సైతం తరలించి జిల్లాకు చేర్చుతున్నారు. కొద్ది నెలల కిందట ఒడిశా నుంచి సముద్రంలో పడవల ద్వారా సారా ప్యాకెట్లు తరలిస్తుండగా రణస్థలం మండలం దోనిపేట వద్ద ఎక్సైజ్, పోలీసులు పట్టుకున్నారు. పదుల సంఖ్యలో బస్తాల్లో ప్యాకెట్లు అప్పట్లో లభ్యమయ్యాయి. గతంలో పొరుగు మద్యం, సారాపై నిఘా ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అటు ప్రభుత్వ చర్యలు మందుబాబులను పొరుగు మద్యంపై ఆసక్తి పెంచేలా చేయగా, ఇటు నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. దీంతో జిల్లాలో మద్యం, సారా ఏరులై పారుతున్నాయి. మద్యనిషేధం మాట అటుంచితే కనీసం నియంత్రించ లేని స్థితిలో ప్రభుత్వం ఉందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక లారీ చక్రాల కింద పడి..

- రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ జవాను మృతి


చిరంజీవి (ఫైల్)

పలాస, మార్చి 26: పలాస జాతీయరహదారి కోసంగిపురం జంక్షన్ వద్ద ఇసుకలారీ చక్రాల కింద పడి సీఆర్‌పీఎఫ్ జవాను చెల్లూరు చిరంజీవి(27) మంగళవారం మృతి చెందారు. ఈయన తన స్వగ్రామం సోంపేట మండలం బేసి రామచంద్రా పురం పంచాయతీ జీడిపుట్టుగ నుంచి తన తాత నివాసం ఉంటున్న అమలపాడు గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న ఇసుక లారీ ఢీకొనడంతో కిందపడి పోయారు. అయన శరీరంపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అపస్మారకస్థితికి చేరుకున్నారు. 108 అంబులెన్స్ సిబ్బంది ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన బీహార్ రాష్ట్రంలో ఏడు నెలల కిందట సీఆర్పీఎఫ్ జవానుగా బాధ్యతలు చేపట్టారు. నెల రోజుల పాటు సెలవులు కావడంతో తన తల్లి అన్నపూర్ణ, తాత, కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుదామని ఇటీవల వచ్చి.. ఇసుక లారీకి బలైపోయారు. దీంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది. సంఘటన స్థలానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు చేరుకొని విలపించారు. కాశీబుగ్గ ఎస్‌ఐ వెంకటరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వుకో.. దండుకో!

- గారలో అనుమతులు లేకుండా ఇసుక తరలింపు
- వైసీపీ నాయకుల ప్రోత్సాహంతోనే..
- ఫిర్యాదు చేయాలంటున్న రెవెన్యూశాఖ

(శ్రీకాకుళం క్రైం)

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం కాగా.. ఇసుకాసురులు తమ పని సాఫీగా కానిచ్చేస్తున్నారు. చీకటి పడితే చాలు.. నదిలోకి ఏకంగా ఎక్స్‌కవేటర్లు తరలించి.. లారీల్లోకి ఇసుకలోడ్ చేసి.. అక్రమ రవాణా చేపడుతున్నారు. శ్రీకాకుళం మండలం రోణంకిలో వైసీపీ నాయకులు.. ప్రభుత్వ అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్న విషయం తెలిసిందే. గార మండలం బూరవిల్లి ప్రాంతంలో ప్రభుత్వ ఇసుక ర్యాంపు కొంతకాలం సాగగా.. అక్కడ పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా ర్యాంపును నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం గారలో తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్‌కు 200మీటర్ల దూరంలో.. వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. గార మండల వైసీపీ నాయకుల సహకారంతో అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టి.. అక్రమార్జన పొందుతున్నారు. కలెక్టర్ అనుమతులు ఉన్నాయంటూ గ్రామస్థులను నమ్మబలికి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. రాత్రివేళ ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు చేపట్టి.. నాటుబళ్లలో ఒడ్డుకు చేర్చుతున్నారు. గుంపులుగా పోసి ఆ ఇసుకను విశాఖపట్నానికి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఇటీవల తహసీల్దార్ ఎం.శ్రీను దృష్టికి తీసుకెళ్లగా.. పోలీసుల సహకారంతో ఇసుక తవ్వకాలను అడ్డుకు న్నారు. అయినప్పటికీ రాత్రివేళ తవ్వకాలు సాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఇసుక అక్రమ రవాణా ప్రాంతాన్ని తహసీల్దార్ ఎం.శ్రీను పరిశీలించారు. వంశధార నదిలో ఎక్స్‌కవేటరు ఉన్నట్టు గుర్తించారు. సోమవారం రాత్రి కూడా లారీలతో ఇసుక అక్రమంగా తరలించారని గ్రామ స్థులు తెలిపారు. దీంతో మరోసారి నదిలో దిగితే వాహనాలు సీజ్ చేస్తామని అక్కడ ఉన్న ఎక్స్‌కవేటరు డ్రైవర్లను తహసీల్దార్ హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై నేరుగా ఫిర్యాదు చేయాలని, అక్రమాలను అడ్డుకుంటామని స్థానికులకు తెలిపారు.


నదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న ప్రొక్లయినర్


ఎక్స్‌కవేటర్ డ్రైవర్లను హెచ్చరిస్తున్న తహసీల్దార్ శ్రీను



మహేంద్రతనయ.. ఎండి'నది'

వేసవి ఆరంభంలోనే.. మహేంద్రతనయ నది అడుగంటడంతో పరిసర ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వంశధార ద్వారా తాగునీటిని అందజేస్తామని సీఎం జగన్ ప్రకటించినా.. ఇంతవరకూ పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకూ పనులు ప్రారంభించే అవకాశం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహేంద్రతనయ నదిలో నీరు లేకపోవడంతో అంతరపంటలు సైతం ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

- మెళియాపుట్టి

వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

జడూరు (పోలాకి): జడూరు గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మంగళవారం జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొండు రామన్న గృహంలో వైసీపీ నాయకులు గుండ హరికృష్ణ, కృష్ణ, గొండు వెంకటరమణ ప్రకాష్, గుండ తాతయ్య, గొండు హరికృష్ణ, డొంకాన చిరంజీవి, ఎన్ని ప్రభాకర్ తదితరులు తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. వైసీపీ నిరంకుశ పాలన భరించలేక టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొండు చైతన్య మురళి తదితరులు పాల్గొన్నారు.



పోలాకి: టీడీపీలో చేరిన వైసీపీ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

చంద్రబాబుతోనే అభివృద్ధి

టెక్కలి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. మంగళవారం గోపినాథపురంలో బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

శిరీష గెలుపు తథ్యం

పలాస: పలాసలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష విజయం తథ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శిరీషను కలిసి అభినందించారు. బీజేపీ, జనసేన నాయకులు కూడా మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. పలాస నియోజకవర్గంలో టీడీపీ-జనసేన-బీజేపీ పవనాలు వీస్తున్నాయని, వైసీపీ మోసాలను ప్రజలు గుర్తించారని శిరీష అన్నారు.

కూటమి నేతలను కలిసిన ఎంజీఆర్

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు మంగళవారం ఆయా పార్టీల నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ నాయకులు చోడవరపు గోవిందరావు, శరత్‌కుమార్‌లను కలిశారు. ఎన్‌డీఏ కూటమి విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



కొత్తూరు: బీజేపీ నేతలతో టీడీపీ అభ్యర్థి గోవిందరావు

ఉమ్మడి అభ్యర్థి గోవిందరావుకు మద్దతు

కోవిలాం(ఎల్.ఎన్.పేట): సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావుకు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించడం జరుగుతుందని కోవిలాం సర్పంచ్ ఎన్.హేమకుమారి తెలిపారు. మంగళవారం గోవిందరావు సర్పంచ్ హేమకుమారి, అనుచరులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ టీడీపీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి అభ్యర్థిగా టికెట్ ఖరారుచేసిందని, ప్రజలందరూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్ర మంలో సర్పంచ్‌లు వి.గోవిందరావు, ఎన్.నారాయణరావు, నాయకులు పోలినాయుడు, కె.బాలకృష్ణ, ఎం.భద్రయ్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్లూరు నుంచి 10 కుటుంబాలు చేరిక

పలాసరూరల్: పలాసమండలం నీలావతి పంచాయతీ కొబ్బరి

వివిధ గ్రామాల్లో మంగళవారం బాబు షూరిటీ, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున క్యాడర్ పాల్గొంది.



గౌతు శిరీష సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

చెట్లూరు గ్రామంలోని వైసీపీకి చెందిన 10 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీ పాలనలో అభివృద్ధి లేదని, అందుకే టీడీపీలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో బి.శ్రీనివాసరావు, సొర్ర తిరుపతిరావు, సొర్ర డిల్లేశ్వరరావు, దుర్గాప్రసాద్, సొర్ర కామేశ్వరరావు, తేజస్, తామాడ ధర్మారావు తదితరులున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, నేతలు పీరికట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శిరీష విజయానికి కృషి

పలాస: పలాస నియోజకవర్గంలో ఎన్‌డీఏ అభ్యర్థి గౌతు శిరీష విజయానికి తామంతా కృషి చేస్తామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రామానందస్వామి తదితరులు ప్రకటించారు. మంగళవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ గెలుపు ఖాయమని, మోదీ మళ్లీ పీఎం పదవిని అలంకరిస్తారన్నారు. జిల్లాలో ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, నేతలు రౌతు చిరంజీవి, మామిడి ప్రసాదరావు, వైశ్యరాజు మోహన్‌రాజు, తర్రం లచ్చుమయ్య పాత్రో, పున్నయ్య పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి చక్రతీర్థ స్నానం



మెళియాపుట్టి: వేణుగోపాలస్వామి డోలో యాత్రలో భాగంగా మంగళవారం చక్రతీర్థ స్నానం నిర్వహించారు. దేవాలయం నుంచి ఉత్సవ మూర్తులను మహేంద్ర తనయ నదికి తీసు కువెళ్లి చక్రతీర్థ స్నానాలు చేయించారు. అర్చకులు గోపీనాథ్ రథో, సన్నో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు 54వ జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం, కొత్తూరుల్లో టీడీపీ అభ్యర్థులు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. అలాగే వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, నందిగాంలోనూ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లుకున్నాయ్..!

వజ్రపుకొత్తూరు: డోకులపాడు పంచాయతీ గంగధర పల్లికి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి గడ్డి తీగెలు అల్లుకున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తీగెలను తొలగించాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగెలు →



శ్మశాన వాటికకు మార్కింగ్ ఇవ్వండి

నరసన్నపేట: సంత తోట వద్ద ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధికి తాము సిద్ధంగా ఉన్నామని, సదరు స్థలానికి మార్కిగ్ ఇవ్వాలని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కనకారావుకు మంగళవారం వినతి పత్రం అందించారు. గ్రామ పెద్దలతో అభివృద్ధి కమిటీ వేసి శ్మశాన వాటికలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆ సంఘ నాయకులు సదాశివుని కృష్ణ, ఉణ్న రంగా, రమేష్ తెలిపారు.

ఆలయ ఆదాయం రూ.2.25 లక్షలు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. గడిచిన ఆరు నెలలకు రూ.2.25 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం భీమేశ్వరస్వామి ఆలయ ఈవో మాధవి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

జగన్ వల్ల మా ఊరికి ఏ ఉపకారం జరగలేదు

- వైసీపీ కార్యాలయ సిబ్బందితో ఓ సామాన్యుడు..
- సామాజిక మాధ్యమాల్లో ఆడియో హల్‌చల్

టెక్కలి, మార్చి 26: సీఎం జగన్ వల్ల మా ఊరికి ఏ ఉపకారమూ జరగలేదని ఓ సామాన్యుడు తేల్చిచెప్పాడు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం తొలుసూరుపల్లికి చెందిన హనుమంతు సింహాచలం అనే వ్యక్తికి టెక్కలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కార్యాలయం నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఈ సంభాషణ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఇది వైసీపీ నాయకులను కలవరపెడుతుంది. ఆ ఆడియో వివరాలు ఇలా..

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: హలో..

సామాన్యుడు: హలో

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: నమస్తే సార్! మేము టెక్కలి దువ్వాడ శ్రీనివాస్ గారి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.

సామాన్యుడు : ఆ.. చెప్పమ్మా

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: జగన్ గారు అందించే పథకాలు ఏవైనా అందుతున్నాయా?

సామాన్యుడు : ఏటీ అందడం లేదమ్మా

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: ఏమిసార్! ఆ పథకాలేవీ మీకు వర్తించవా?

సామాన్యుడు : ఏటీ వర్తించలేదు. రండి సూబెడతాను. ఏటి వర్తించాయో నాకు సూపెట్టండి.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది : పరవాలేదు సార్

సామాన్యుడు : జగన్ తాలుకవి నాకు ఏటి వర్తించాయో నాకు సూపెట్టండి.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది : మరి సచివాలయానికి వెళ్లి అడిగారా?

సామాన్యుడు: తిరిగి తిరిగి కాళ్లరిగిపోయాయి. ఏ నాయకుడు పట్టించుకోలేదు. బాటా చెప్పులు అరిగిపోయాయి. సైట్లు ఇస్తామన్నారు. రాత్రి 9గంటలకు, 10గంటలకు రమ్మన్నారు. దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద రాత్రి 12, ఒంటి గంట వరకు ఉన్నా ఒక్క సైటు ఇవ్వలేదు మా ఊరికి.. మాకు జగన్ వల్ల ఏ ఉపకారం లేదు.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: అదేంటి సార్! చాలామందికి పథకాలు వచ్చాయి కదా?

సామాన్యుడు : తొలుసూరుపల్లికి పడ్డాయో లేదో అడగండి. వచ్చి ఎంక్వైరీ చేయండి. తప్పేముంది.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: సరే సార్!

సామాన్యుడు : గ్రామంలో నేనూ ఒక మనిషినే. నాకు ఏమీ రాలేదని చెప్పాను. ఇప్పుడు ఇద్దరు ఆడపిల్లలు. అమ్మఒడి డబ్బులు పడతాయన్నారు. నాకు పడలేదు.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: పడలేదా?

సామాన్యుడు : ఏవి ఎవరిచ్చారు?

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: అదే ఎందుకు పడలేదు అడిగారా?

సామాన్యుడు: ఎందుకు పడలేదంటే జగన్‌ను వెళ్లి అడగండి. అతను వేయక గిట్టక ఇవి మీటర్లు అంటూ దన్ను పెట్టేశాడు.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: మీపేరు అవి చెప్పండి. సార్‌కు ఇన్‌ఫార్మ్ చేస్తాను?

సామాన్యుడు : నా పేరు హనుమంతు సింహాచలం.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: ఒకేసార్ సింహాచలం

సామాన్యుడు : మాకు జగన్ తాలుకవి ఏవీ రాలేదు.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: మీ ఊరి పేరు ఏంటి సార్?

సామాన్యుడు: తొలుసూరుపల్లి. నాకు మాత్రం ఒకటొచ్చిందమ్మా. 18 మీటర్లు నా పేరున వచ్చాయి. అవి వెంటనే నాకు ఇచ్చేమని చెప్పండమ్మా. నాకు ఇల్లు వద్దు, సైట్లు వద్దు.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: మీ వలంటీర్ పేరు చెప్పండి?

సామాన్యుడు : ఊర్వశి అమ్మా.. ఊర్వశి.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: సార్‌కు ఒకసారి ఇన్‌ఫార్మ్ చేస్తాను.

సామాన్యుడు: వద్దులే అమ్మ. మరి ఇంకా ఎలా అయిపోయింది కదా. మరింకేటి ఇప్పుడి చేస్తారు. వద్దులే అమ్మ తప్పు. అతనికి బాధపెట్టకండి. మరి ఇంకిప్పుడు ఎక్కడిచ్చేస్తారు. వద్దులే అమ్మ ఫోన్ పెట్టే తల్లి.

దువ్వాడ కార్యాలయ సిబ్బంది: సరే సార్. ఉంటాను మరి. ఫ్యాన్ గుర్తుకు ఈసారి ఓటెయ్యండి.

సామాన్యుడు : ఈసారి ఫ్యాన్ గుర్తుకు ఐదులో పెట్టేద్దాంలే అమ్మ. ఉంటాను. నీ డ్యూటీ నువ్వు చెయ్యి నీ కడుపునిండుతుంది.

శిలా ఫలకాలు మూశారు




ఆర్బీకే వద్ద శిలాఫలకాన్ని మూసివేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వజ్రపుకొత్తూరు: వజ్రపు కొత్తూరు ఆర్బీకే వద్ద శిలా ఫలకాలు, ప్రభుత్వ పథకాలను మూసివేశారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'కోడ్ వచ్చి పది రోజులైనా' శీర్షిక తో వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. తక్షణం తగు చర్యలు తీసుకుని నిబంధనలను పాటించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వీఆర్వో తిరుమలరావు శిలా ఫలకాలు, పథకాలు కనిపించకుండా పేపర్లను అంటించారు. అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని డీటీ గిరిరాజు ఆదేశించారు.

త్వరలో ప్రజల వద్దకు 'కలమట'



కొత్తూరు: త్వరలో ప్రజల వద్దకు కలమట కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి తెలిపారు. మంగళవారం మాతలలోని కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు కాకుండా వేరే వ్యక్తికి టికెట్ కేటాయించడం బాధాకరంగా ఉందన్నారు.

ఫిజియోథెరపీతో ప్రయోజనం

ఎల్.ఎన్.పేట: అంగవైకల్యం ఉన్న పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించడం ద్వారా ప్రయోజనం కనిపిస్తుందని సమగ్రశిక్ష సీఎంవో పి.ప్రభాకరరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ఎంఈవో సీహెచ్ మణికుమార్ ఆధ్వర్యంలో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంవో మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు వయసు ఉన్న దివ్యాంగులందరూ ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా వారి తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా హిర మండలం, సరుబుజ్జిలి, బూర్జ, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల నుంచి 160 మంది దివ్యాంగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఈ సీవో ఉమ, జీసీబీవో నీరజ, ఎంఈవో-2 కె.చంద్రమౌళి, వైద్యాధికారులు సునీత, షన్ముఖరావు, శాంతి, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

'ఎలుగు'ల దాడి నుంచి ప్రజలను రక్షించాలి

పలాసరూరల్: ఉద్దాన ప్రాంత గ్రామాల్లో ఎలుగుబంట్ల బెడద ఎక్కువగా ఉందని, దీని నుంచి ప్రజలను రక్షించాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ ప్రతినిధులు, బొడ్డపాడు యువజన సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. జీడి పిక్కల సీజన్ కావడంతో రైతులు పొలాల్లోకి వెళతారని, ఎలుగులు కూడా ఇదే సమయంలో సంచ రిస్తుండడంతో భయాందోళన చెందుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నిరంతరం ఎలు గులు దాడులు చేస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు నివారణ చర్యలు తీసుకోలేదని వారు ఆవే దన వ్యక్తంచేశారు. ఎలుగు దాడుల్లో చనిపోయిన బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి రూ.5 లక్షలు అందించి ఆదుకోవాలన్నారు. అలాగే అటవీ శాఖాధికారులకు కూడా వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా సం ఘాల ప్రతినిధులు దాసరి శ్రీరాములు, కుత్తుమ మాధవరావు, బి.మోహనరావు, పి.దుర్యోధన, తామాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

వజ్రపుకొత్తూరు: అనకాపల్లి గ్రామానికి చెందిన జీడి రైతులు కూర్మారావు, మోహనరావు ఎలుగుబంటి దాడిలో మృతి చెందారని, వారి కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబా ల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. గాయపడిన వారికి జీవితాంతం నెలకు రూ.10 వేలు వంతున సాయం అందించాలని కోరారు. పరామర్శించిన వారిలో మామిడి మాధవరావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, జి.రామారావు, హేమారావు చౌదరి ఉన్నారు.

భవన నిర్మాణాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

పలాసరూరల్: బొడ్డపాడులో విప్లవ ఉద్యమకారులు కుమారన్న, జయక్క స్మారకంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం సదరు ప్రదేశాన్ని ప్రజాసంఘాల సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమరుల స్ఫూర్తికి ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో నిర్మాణం చేపడుతుండగా రాత్రి వేళ ధ్వంసం చేయడం సరికాదని, ఇలాంటివి పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చాపర వేణు, తామాడ సన్యాసిరావు, తాండ్ర ప్రకాశ్, పి.అరుణ, గురయ్య, సర్పంచ్ తామాడ మదన్, ఉప సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డేదీ?

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి కంద్రవీధి కాలనీలో రోడ్డు ఆనవాళ్లే కనిపించడం లేదు. ఈ కాలనీలో సుమారు 200 మంది ప్రజలు నివసిస్తున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో వారు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండ పక్కనే కాలనీ ఉండడం వల్ల రహదారి లేక పోవడంతో వల్ల రాత్రి వేళల్లో రాకపోకలకు ఇక్కట్లకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రోడ్డు లేని కంద్రవీధి కాలనీ

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి


గున్నయ్య మృతదేహం

హరిపురం: మందస మండలం సువర్ణాపురం పంచాయతీ చిన్న సువర్ణాపురం (ఉగ్రవానిపేట)లో మంగళవారం విద్యుదాఘాతానికి గురై తాపీమేస్త్రీ సాలిన గున్నయ్య(40) మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన గున్నయ్య అత్తవారి గ్రామమైన బహడపల్లిలో స్థిరపడ్డాడు. తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉగ్రవానిపేటలో ఇంటి నిర్మాణం పనిచేస్తున్నాడు. స్లాబ్ వేసేందుకు గజాలను సిద్ధం చేస్తుండగా ఇంటి పైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్తు తీగలకు ఇనుపగజం తగలడంతో వెంటనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

హరిపురం: మందస మండల కేంద్రంలోని రాజుకోట ఆవరణలో సాహు సింహాచలం(38) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులెవరూ లేకపోవటంతో చెత్త ఏరుకొని, పబ్లిక్ మరుగుదొడ్లు శుభ్రం చేసుకుంటూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసవడం, సరైన ఆహారం లేక అనారోగ్యానికి గురై మృతిచెందినట్టుగా స్థానికులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ అనిల్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: మండల పరిధి ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ గంగారత్నం ఆధ్వర్యంలో సారా ఊటలపై మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 4,400 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు సీఐ రామచంద్రకుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో సారా తయారు చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో మూకుమ్మడి దాడులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ అధికారులు రాజశేఖర్, పద్మలోచన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ అప్పగింత


బ్యాగ్ అప్పగిస్తున్న హోంగార్డు రామయ్య

శ్రీకాకుళం క్రైం: నగరంలో హౌసింగ్ బోర్డ్ కాలనికి చెందిన ఆర్.శ్రీనివాసరావు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. మంగళవారం విధి నిర్వహణలో భాగంగా విజయనగరం వెళ్లి తిరిగి బండిమీద శ్రీకాకుళం వస్తుండగా.. పాత బస్టాండ్ సమీపంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి ఢీకొట్టాడు. అయితే అప్పటికే ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో శ్రీనివాసరావు హడావుడిగా వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బండికి ఉంచిన బ్యాగ్ అక్కడే పడిపోయింది. ఇంటికి వెళ్లి చూడగా బ్యాగ్ కనిపించకపోవడంతో వెతుక్కుంటూ వెనక్కి వచ్చి బండి ఢీకొట్టిన చోట ఆరా తీశాడు. ఇదిలావుంటే బైక్ ఢీకొన్న సమయంలో పడిపోయిన బ్యాగ్‌ను ఓ వ్యక్తి పట్టుకుని వెళ్లి పోతుండడం గమనించిన హోంగార్డు కె.రామయ్య అతడికి ఆపి విచారించాడు. దీంతో ఆ బ్యాగ్ తనకి దొరికిందని చెప్పాడు. దీంతో హోంగార్డు రామయ్య బ్యాగును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి అప్పగించేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలో ఆర్.శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని హోంగార్డుకి జరిగింది చెప్పాడు. బ్యాగ్‌లో ఉన్నవాటి వివరాలు శ్రీనివాస్ చెప్పడంతో అతడికి అప్పగించారు. ఈ బ్యాగ్‌లో రూ.5000 నగదుతో పాటు రూ.30,000 విలువ చేసే మెడికల్ కిట్ ఉన్నాయి. తన బ్యాగ్ అప్పగించిన రామయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణంపై నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పొందూరు: పంచాయతీ అనుమతి లేకుండా సెల్‌టవర్ నిర్మాణంపై తాడివలస గ్రామస్థులు మంగళవారం నిరసన తెలిపారు. గ్రామసమీపంలో నిర్మించడం వల్ల రేడియేషన్ ప్రభావంతో ఇబ్బంది పడాల్సివస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.టవర్ నిర్మాణం నిలుపుదల చేసేవరకు నిరసన తెలియజేస్తామని సర్పంచ్ తమ్మినేని మనెమ్మ తెలిపారు. టవర్ నిర్మిస్తున్నట్లు కనీస సమాచారం లేదని చెప్పారు. ఈ విషయంపై ఆ కంపెనీ ఉద్యోగి సంతోష్‌ను వివరణ కోరగా జీవో-2 ప్రకారం ఆన్‌లైన్‌లో ప్రత్యేకపోర్టల్‌లో దరఖాస్తు చేశా మని, పంచాయతీ అనుమతి ఇంకా తీసుకోలేదని చెప్పారు.

అనుకూలమైన నిర్ణయం కోసం వేచి చూద్దాం

అరసవల్లి: రాజకీయ పార్టీలో అసమ్మతి అనేది క్యాన్సర్ లాంటిదని, తొలి దశలోనే దానిని నివారించాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాము నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం కావాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులను కోరామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మమ్మల్ని సంప్రదించి నిర్ణయం ప్రకటించడానికి కొద్ది సమయం వేచి ఉండాలని కోరారని, అనుకూలమైన నిర్ణయం కోసం మరికొంత సమయం వేచి చూద్దామని తెలిపారు. రెండేళ్ల నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితో అసమ్మతి గురించి మాట్లాడినప్పటికీ చర్యలు తీసుకోలేదు సరికదా, వారిని అందలం ఎక్కించడమే ప్రస్తుత సమస్యకు కారణమన్నారు. పార్టీ శ్రేయస్సుకు అనుకూలమైన నిర్ణయం వస్తుందని, అందరూ క్రమశిక్షణతో ఎదురుచూద్దామన్నారు.

అర్చకులకు రక్షణ లేదు

● ఏపీ సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద

పొందూరు: వైసీపీ ప్రభుత్వంలో ఆలయాలు, హిందూమతానికే కాకుండా, అర్చకులకు రక్షణ లేకుండా పోతోందని ఏపీ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. కాకినాడ దేవాలయం వీధిలో సోమవారం పురాతన శివాలయం అర్చకులపై వైసీపీ నాయకుడు చంద్రరావు భౌతికదాడి చేయడం హిందూ సమాజంపై దాడి చేయడమేనని తెలిపారు. సమాజం బాగుండాలని నిత్యం కైంకర్యాలు, పూజలు నిర్వహించి దేవ దూతలుగా భావించే అర్చకులపైనే దాడి చేయడం హిందూసమాజం ఖండిస్తోందని పేర్కొన్నారు. పూర్వం ఆలయాలు, అర్చకులు, బ్రాహ్మణులపై రాక్షసులు దాడిచేస్తే నేడు వైసీపీ గూండాలు రాక్షసులుగా మారారన్నారు. సీఎం జగన్‌రెడ్డి హిందువుల మనోభావాలను ఏనాడు గౌరవిం చలేదని తెలిపారు. వైసీపీ నాయకులకు, ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పాలని కోరారు. హిందూ సమాజంపై ద్వేషం చూపుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించడానికి హిందూ సమాజం సిద్ధంగా ఉందని తెలిపారు.

సైకతశిల్పంతో కళాకారులకు శుభాకాంక్షలు



ఆమదాలవలస: గాజులకొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఇసుకతో సైకత శిల్పాన్ని వేసి కళాకారులకు శుభాకాంక్షలు తెలియజేశాడు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ బుధవారం ప్రపంచ కళాకారుల దినోత్సవం పురస్కరించుకుని రంగస్థల, వివిధ రంగాల కళాకారులకు సైకత శిల్పం ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు తెలిపాడు.

తాగునీరు గగనమే..

● అసంపూర్తిగా ఇంటింటి కొళాయి పనులు
● అవస్థలు పడుతున్న పెంట గ్రామస్థులు

జి.సిగడాం: ఇంటింటి కొళాయిల ద్వారా గ్రామస్థులకు తాగునీరు గగనంగా మారింది. ప్రజల మెప్పు కోసం ఆదరాబాదరాగా తవ్వకాలు చేపట్టి ఇంటింటి కొళాయిలను ఏర్పాటు చేసి నీరు ఇవ్వకపోవడంతో అవి దిష్టిబొమ్మల్లా మారాయి. పెంట గ్రామంలో గతేడాది సెప్టెంబరులో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు కోసం గట్టిగా ఉన్న సీసీ రోడ్లను తవ్వి పనులు ప్రారంభించారు. అంతటితో ఆగకుండా ఈ ఏడాది జనవరిలో పండగ సీజన్‌కు తాగునీరు అందిస్తామంటూ అత్యుత్సాహంతో అడ్డదిడ్డంగా ట్యాప్‌లు అమర్చారు. దీంతో గ్రామంలో పూర్తిస్థాయిలో తాగునీరు అందకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక ఇంటికి నీరు వస్తే పక్కింటికి నీరు రాని పరిస్థితి దాపురించింది. పక్కవీధి మహిళలు ప్రధాన వీధిలో తాగునీరు పట్టేందుకు వస్తున్నారు. మీసాలవీధి, జంగాల వీధి, సాయిరాం కాలనీ తదితర వీధుల్లో కొళాయిలు ఏర్పాటు అంతంత మాత్రంగానే మారింది. మరికొన్ని వీధుల్లో తాగునీరు రాక ట్యాపులు దిష్టిబొమ్మలా మారాయి. కొళాయిలు ఏర్పాటుకు రోడ్లు తవ్వేయడంతో ప్రధానవీధితో పాటు పలు వీధులు వర్షం పడితే చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ పరిస్థితి తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం..

మీసాల వీధిలో పనులు నిలుపుదల చేయడంతో తాగునీరు అందటం లేదు. కొళాయి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. త్వరితగతిన పనులు ప్రారంభించి తాగునీరు అందిస్తాం. ప్రధానవీధిలో అసంపూర్తిగా ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. జంగాలవీధిలో కొళాయిలు ఏర్పాటు చేసేందుకు సరైన మార్గం లేకపోవడంతో కొళాయిలు వేయలేకపోతున్నాం.

\- పొట్నూరు సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, పెంట


మీసాలవీధిలో దిష్టిబొమ్మల్లా కొళాయి పాయింట్లు


కొళాయిల కోసం తవ్వేయడంతో రోడ్డు దుస్థితి

తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోండి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్


మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రానున్న రెండు నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో వేసవి ఎద్దడిని అధిగమించేందుకు చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నిశాకుమారి, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, డీపీవో వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దెదించడానికి ప్రజల ఎదురుచూపు


పొందూరు: లోలుగు శంఖారావంలో రవికుమార్

పొందూరు: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి ప్రజలు ఎదు రుచూస్తున్నారని ఆమదావలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ తెలిపారు. మంగళవారం లోలుగులో శంఖారావం పేరుతో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని తెలిపారు. అలాగే పొందూరు లావేటివీధికి చెందిన బల్ల సంతోష్ ఆధ్వర్యంలో 25 చేనేత కార్మిక కుటుంబాలు రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు సీపాన శ్రీరంగ, వందాన మురళి, బలగ శంకర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం


కంచిలి: అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి: చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం ముండలా, సాగరనౌగాం గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాల పై ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు బంగారు కురయ్య, నాయకులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, తమరాల శోభన్, ఆశిలీలా రాణి తదితరులు పాల్గొన్నారు.

తెలగలను బీసీలో చేర్చాలి

లావేరు: ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులస్థులను బీసీలో చేర్చే వరకు పోరాటం ఆగదని ఉత్తరాంధ్ర తెలగ కుల బీసీ సాధన సమితి నాయకులు పల్లంట్ల వెంకట రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రం లావేరులో ఆయన ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల తెలగ కులస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న అనేక జిల్లాల్లో గల తెలగ కులస్థులను ఇప్పటికే బీసీలో చేర్చారని, ఉత్తరాంధ్రలో ఉన్న వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. తమకు అండగా ఉన్న వారికే రానున్న ఎన్నికల్లో మద్దతుగా ఉంటామని చెప్పాలన్నారు. సంఘ నాయకులు ముప్పిడి సురేష్, శ్రీనివాసరావు, తోటయ్యదొర, కె.దామోదరరావు పాల్గొన్నారు.

టెక్‌ఫెస్ట్ వెబ్‌సైట్ ప్రారంభం

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ పరిధిలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో వచ్చే నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్ టెక్నికల్స్‌కు సంబంధించి వెబ్‌సైట్‌ను వర్సిటీ వీసీ ఎం.విజయకుమార్ ఆన్‌లైన్ వేదికగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. టెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా భాగస్వామ్యులై పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యాలను పొందాలని సూచించారు. క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మదీనా దర్గాలో నేడు చందనోత్సవం


విద్యుత్ వెలుగుల్లో మదీనా బాబా దర్గా

గార: కళింగపట్నంలో ప్రసిద్ధ మదీనా దర్గాలో బుధవారం ఉర్సు (చందనోత్సవం) వైభవంగా నిర్వ హించనున్నారు. ఏటా రంజాన్ మాసంలో చంద్రుడు కనిపించిన 16వ రోజున ఇక్కడ చందర ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం బాబా సమాధి శుద్ధి కార్యక్రమం ముజావరుల సన్నిధిలో నిర్వహిస్తారు. అనంతరం ఖురాన్ పఠనం చేస్తారు. సాయంత్రం చాదర్ చందనం ఊరేగింపు ఉంటుంది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడు రోజులపాటు దర్గా వద్ద అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు శుభరాట

కంచిలి: మండలంలోని తలతంపరలో శ్రీరామనవమి నవరాత్రి పూజల నేపథ్యంలో కమిటీ అధ్యక్షుడు మర్రిపాటి పూర్ణ, సర్పంచ్ జగబందు దొళాయి, బృందావన్ దొళాయి తదితరులు మంగళవారం శుభరాట వేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

గుడారి పోలమ్మ విగ్రహం ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: న్యూకాలనీలో సత్యసాయి మందిరం పక్కన గుడారి పోలమ్మ ఆలయం పునఃప్రారం భోత్సవం మంగళవారం నిర్వహించారు. మంగళవాయి ద్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారికి విగ్రహానికి తిరువీధి నిర్వహించారు.

మంత్రి ధర్మాన వెన్నులో వణుకు


మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శకం మొదలైందని, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలం చూసి మంత్రి ధర్మాన వెన్నులో వణుకు మొదలైందని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఓ హోటల్‌లో కూటమి నాయకులతో నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతానన్నారు. మాజీమంత్రి గుండ దంపతుల సూచనలు, సలహాలు తీసుకుని ముందుకు వెళతానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చల్లా వేంకటేశ్వరరావు, కోరాడ సర్వేశ్వరరావు, బొనిగి భాస్కరరావు, పాండ్రంకి శంకర్, దొండపాటి నవీన్, ఉదయ్, బొంగు భాస్కర్, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు. కాగా తన కార్యాలయంలో గొండు శంకర్ మాట్లాడుతూ.. మంత్రి ధర్మాన మాయలో పడొద్దని, అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామన్నారు.

నృత్య కళాకారుల ప్రదర్శన

ఇచ్ఛాపురం: స్థానిక అయ్యప్ప పంచాయతన ఆలయంలో ధర్మకర్త దుర్గా గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి జయంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భర తనాట్యం, కూచిపూడి, కథాకళి, జనాపథ నృత్యాలు అలరిం చాయి. దుర్గా గురుస్వామికి చాట్ల రామలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి సన్మానించారు.

ఆదిత్యుని హుండీల లెక్కింపు రేపు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం హుండీల లెక్కింపు ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 8.00 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు, ఆలయ పాలక మండలి సభ్యులు, సిబ్బంది, అర్చకులు, గ్రామస్థుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఏసీఎఫ్ఐ కార్యదర్శిగా రమణమూర్తి

సరుబుజ్జిలి: ఏసీఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా ఆమదాలవలస నియోజకవర్గ సామాజిక సేవా ప్రతినిధి గొండు రమణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఏసీఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌రాజిక్, ఉపాధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు, కన్వీనర్ సురేష్ చేతులమీదుగా విశాఖపట్నంలో నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

వేసవి పంటలు సాగు చేయాలి

సరుబుజ్జిలి: రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట అనంతరం పొలాలు ఖాళీగా ఉంచకుండా వేసవి పంటలు వేయడంతో భూగర్భ జలాలు ఆవిరికాకుండా కాపాడవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని సవలాపురం, వీరమల్లిపేట, రొట్టవలసల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో రైతులకు వేసవి పంట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు ఎస్.తిరుపతి, విజయభాస్కర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయాలి

ఇచ్ఛాపురం: నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని వైసీపీ ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్ కోరారు. మంగళవారం ఇచ్ఛాపురంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు నరేష్‌కుమార్ అగ్రవాలా పాల్గొన్నారు.

బస్సుయాత్ర విజయవంతం కావాలి

శ్రీకాకుళం అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27 నుంచి ముఖ్యమంత్రి జగన్ చేపట్టనున్న సిద్ధం బస్సుయాత్ర విజయవంతం కావాని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం నరంలోని దుర్గా మహాలక్ష్మి ఆలయంలో తెన్నేటి సునీల్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు రాజ్యశ్యామల మూలమంత్ర సహిత దుర్గా సంపుటిత హోమం నిర్వహించారు. కోణార్క్ శ్రీను, అందవరపు ప్రసాద్, సంతోష్, గొండు కృష్ణ, సుంకరి కృష్ణ, మండవిల్లి రవి, ఎంపీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేద్దాం

అరసవల్లి: పార్టీ నిర్ణయానికి అంతా కట్టుబడి పని చేద్దామని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో గల స్థానిక బలగ 1వ వార్డు నుంచి 7వ వార్డులకు చెందిన చిట్టి నాగభూషణరావు, రాజారావు, కేవీఎస్ నాయుడు(బుజ్జి), రెడ్డి సూర్యనారాయణ, రొక్కం భాస్కర్, రౌత్ సంతోష్, మూకళ్ల రామారావు, దొండపాటి నవీన్, పేడాడ రమణమూర్తి, రెడ్డి శంకర్ తదితరులు గొండు శంకర్‌కు మద్దతు తెలిపారు.

నేడు కన్యాశుల్కం నాటిక ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా బాపూజీ కళామందిర్‌లో సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం సాంఘిక నాటకం ప్రదర్శించనున్నారు. ఈ నాటికకు సుమిత్ర కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకర్ శర్మ దర్శకత్వం వహించనున్నారు. 28న కౌసల్యా సుప్రజా రామా, ఎడారిలో వాన చినుకు, 29న మూల్యం, కబ్జా, 30న ఇంద్రప్రస్థం, పక్కింటి మొగుడు నాటికల ప్రదర్శన, రంగస్థలం కళాకారులకు సత్కారం ఉంటుందని కళా సమితి ప్రతినిధులు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. మంగళవారం రైల్వే అండర్ టర్నల్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృత్యువాత పడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కూర్మనాథ ఆలయంలో సంప్రోక్షణ



గార: డోలోత్సవాలు అనంతరం మంగళవారం ఉదయం శ్రీకూర్మనాథ ఆలయంలో అర్చకులు సంప్రోక్షణ నిర్వహించారు. శుద్ధ జలాలతో స్వామి వారి సన్నిధి, ఇతర మండపాల ప్రాంగణంలో సంప్రోక్షణ జరిపారు. ప్రధాన అర్చకులు, ఈవో, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఏపీఎం సనపల ప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముగ్గుల రూపంలో ఓటు వినియోగంచుకోవాలో అవగాహన కల్పించారు.

● **సరుబుజ్జిలి:** ఓటు హక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్ తెలిపారు. పురుషోత్తపురంలో ఓటు వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు సీసీ కూన రోజాలత తదితరులు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** ప్రతీ ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. మంగళవారం బాతువలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, గ్రామైఖ్య సంఘ అధ్యక్షులు, స్వయంశక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** ఓటు హక్కు వినియోగాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అప్పారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు కార్యక్రమంలో తహసీల్దార్ వైఎస్‌వీవీ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

● **ఎల్ఎన్ పేట:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ రాణి అమ్మాజీ అన్నారు. మంగళవారం మల్లికార్జునపురం, తురకపేట గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ఐ గవరయ్య, ఏపీఎం రవిరాజ్, రెవెన్యూ కార్యదర్శులు రాంబాబు, ఎల్.తిరుమలరావు, పార్వతి పాల్గొన్నారు.

● **నందిగాం:** వెలుగు ఆధ్వర్యంలో మంగళవారం దేవపురం, తురకలకోట, ఆనందపురం, పాత్రునివలస తదితర గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఏపీఎం జాంభవతి, వెలుగు సీసీలు, వీవోఏలు, కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

● **హిరమండలం:** ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. మంగళవారం దుర్బలాపురం, కొండరాగోలు, గులుమూరు, జగన్నాథపురం గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీలు నిర్వహించారు.

● **పోలాకి:** ఓటు వజ్రాయుధమని, దానిని సద్వినియోగం చేసుకుని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని వెలుగు ఏపీఎం గోరు రాజారావు అన్నారు. మంగళవారం దీర్ఘాశిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● **జలుమూరు:** సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కలిగించాలని తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.


జి.సిగడాం: బాతువలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీ..



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యులు


పాతపట్నం: ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


ఎల్ఎన్ పేట: మల్లికార్జునపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్


నందిగాం: దేవుపురంలో అవగాహన ర్యాలీ



హిరమండలం: అవగాహన కలిగిస్తున్న దృశ్యం


పోలాకి: దీర్ఘాశిలో మానవహారంగా..